క్లుప్తంగా

నేటినుంచి అన్నదానం

కోదాడరూరల్ : పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్ గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో సోమవారం నుంచి జనవరి10 వరకు మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాలి శ్రీనివాసనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అన్నదానంలో అయ్యప్ప మాలధారులతో పాటు అందరు స్వాముల మాలధారులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

రేపు మహా పడిపూజ

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండ గ్రామంలో మంగళవారం అగ్నిగుండ మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురుస్వామి సంపెట రవిగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రవరం ప్రధాన అర్చకులు, బ్రాహ్మణ గురూజీ, ఇనుపకుతికెల నరసింహామూర్తిశర్మ ఆధ్వర్యంలో ఈ పడిపూజ నిర్వహిస్తున్నామని పరిసర ప్రాంతంలోని అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రిలో పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ



బాలింతకు బ్రెడ్ పంపిణీ చేస్తున్న రాము

హుజూర్‌నగర్ : పట్టణంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని బాలింతలకు, గర్భిణులకు, రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి చింతకాయల రాము, నాయకులు వినోద్, ఎం.వెంకటనారాయణ, లక్ష్మయ్య, ఎల్లయ్య, ఎంఆర్‌కే, నాగేందర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తి

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నేటి నుంచి 14వరకు 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ చింతలపాటి వాణి తెలిపారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ క్రీడా పోటీల్లో సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాలకు చెందిన 9బాలికల గురుకుల పాఠశాలలకు చెందిన 765మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు ఆమె వెల్లడించారు. ఇప్పటికే క్రీడల నిర్వహణకు క్రీడా ప్రాంగణాలు సిద్ధం చేసినట్లు, హాజరు కానున్న క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.


కవి, రచయిత శ్రీనివాస్‌కు ప్రతిభా పురస్కారం



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న కర్ల శ్రీనివాస్

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన కవి, గాయకుడు, రచయిత కర్ల శ్రీనివాస్ ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రజాకవి కాళోజీ కవితా పోటీల్లో పాల్గొని ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించిన కవితా పోటీల్లో పాల్గొని అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కాగా శ్రీనావాస్‌ను పలువురు నాయకులు, కళాకారులు, అభినందించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా యాకూబ్



గరిడేపల్లి : మండల పరిధిలోని అబ్బిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కె యాకూబ్ సీపీఎం మండల కార్యదర్శిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కమిటీ సభ్యులుగా తుమ్మల సైదయ్య, బొల్లిపల్లి శ్రీనివాస్, యానాల సోమయ్య, దోసపాటి భిక్షం, బోయిళ్ల అర్జున్, అంబటి భిక్షం, ఎస్‌కె వలి, మీసాల మట్టయ్య, పఠాన్ మైబెల్లి, రావిరాల శ్రీనివాస్, మండవ సైదులు, నందిపాటి మట్టయ్య, వేమగాని వెంకటేశ్వర్లు, యానాల సుశీల, జుట్టుకొండ కలమ్మ, దోసపాటి సుధాకర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నిరంతరం ప్రజా పోరాటం నిర్వహిస్తామన్నారు.

వరి కోతలు ముమ్మరం

- పచ్చి ధాన్యాన్నే మిల్లులకు తరలించి విక్రయిస్తున్న రైతులు
- వారం వ్యవధిలో క్వింటాకు రూ.300కోత
- ప్రభుత్వం బోనస్ ప్రకటించినా ఐకేపీ కేంద్రాలకు చేరని సన్నరకం ధాన్యం



వరిపంట కోస్తున్న యంత్రం

పాలకవీడు : మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వానాకాలంలో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోతదశకు చేరడంతో యంత్రాల సాయంతో పంట నూర్పిడి చేస్తున్నారు రైతులు. కోసిన పచ్చి ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. ఈ సీజన్‌లో వరినాట్లు కాస్త ఆలస్యమైనా సాగర్ ఆయకట్టు పరిధి జాన్‌పహాడ్ మేజర్ కాల్వ నుంచి నీరురావడంతో మండలంలో సుమారు 18వేల ఎకరాల్లో వరిసాగైనట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ ప్రకటించడంతో వంద శాతం రైతులు సన్నధాన్యాన్ని సాగుచేశారు.

యంత్రాలకు ఏర్పడిన భారీ డిమాండ్..

ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో వరి పంట కోతదశకు రావడంతోయంత్రాలకు డిమాండ్ పెరిగింది. ట్రాకింగ్ యంత్రాలకు గంటకు రూ.3వేల నుంచి రూ.3,500వరకు తీసుకుంటున్నారు. ఫోర్ వీల్ డ్రైవ్ యంత్రాలకు అదేస్థాయిలో డిమాండ్ పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సంవృద్ధిగా వర్షాలు కురవడంతో పలు జిల్లాల్లో ఒక్క సారిగా పంట కోతకు చేరడంతో ఎక్కడికక్కడ యంత్రాలు నూర్పిడి చేస్తున్నాయి. దీంతో యంత్రాలకు భారీగా డిమాండ్ పెరిగింది.

పచ్చి ధాన్యాన్ని మిల్లులకు తరలింపు..

రైతులు యంత్రాల సాయంతో కోసిన పచ్చి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నారు. వారం రోజుల క్రితం క్వింటాకు రూ.2600ల వరకు ఉన్న సన్నరకం ధాన్యం ధర మిల్లర్ల మాయాజాలంలో రోజురోజుకూ తగ్గిస్తూ ప్రస్తుతం రూ.2200 చేరింది. దీంతో అన్నదాతలు మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం రాని నష్టాలు ఇప్పుడెలా వచ్చాయని మిల్లర్లను నిలదీస్తున్నారు. ప్రభుత్వాలు జోక్యం చేసుకుని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని, మద్దతు ధరకు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలకు చేరని సన్నరకం ధాన్యం..

సన్నరకం ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ అందజేస్తూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయినా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావడానికి ఆసక్తి చూపడంలేదు. వాతావరణంలో మార్పులు, చలి ప్రభావంతో ధాన్యం ఆరబెట్టడం రైతులకు కష్టంగా మారడంతో పాటు, అదనపు ఖర్చులు పెరిగాయి. దీంతో గత్యంతరం లేక పచ్చి ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు.

ఐక్యతకు ప్రతీకలు.. కార్తీక వనభోజనాలు

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : ఐక్యతకు కార్తీక వనభోజన మహోత్సవాలు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దోరకుంట శివారులో గల ఏర్నేని వెంకటరత్నం బాబు మామిడితోటలో నిర్వహించిన కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం కార్తీక వనభోజన మహోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక మాస వనభోజన మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం పలువురికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని సంఘ నాయకుల ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఏర్నేని వెంకటరత్నంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, నియోజకవర్గంతో పాటు మేళ్లచెరువు మండల కమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన ఎలక శ్రీనివాసరెడ్డి సత్యవతి దంపతులు రూ.10,116, నల్లగొండకు చెందిన భవిరిశెట్టి వెంకటేశ్వర్లు రూ.10,116లు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవిరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకట సత్యనారాయణ గుప్త, వందనపు సూర్య ప్రకాషరావు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : గ్రామగ్రామాన సీపీఐ వందో ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. అలాగే పార్టీ సభ్యత్వాలను పూర్తి స్థాయిలో చేయాలని సూచించారు. డిసెంబర్‌లో నల్లగొండలో జరిగే పార్టీ వంద సంవత్సరాల వేడుక మహాసభకు మండలం నుంచి భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నాయకులు దొడ్డా వెంకటయ్య, రెమిడాల రాజు, చేపూరి కొండలు, సాహెబ్ అలీ, సాతులూరి అలివేలు, రెమిడాల జయసుధ, దొడ్డా నాగేశ్వరరావు, కస్తూరి సత్యం, కాంపాంటి వెంకటయ్య, రామిశెట్టి కోటయ్య, తాళ్లూరి రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్ రామారావుకు సన్మానం



కోదాడరూరల్ : రామారావును సన్మానిస్తున్న బాల్య స్నేహితులు

నడిగూడెం : కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండకు చెందిన వంగవీటి రామారావు ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనను గ్రామంలో కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు పందిరి వెంకటరెడ్డి, పల్లపు శ్రీనివాస్, దున్నా లింగయ్య తదితరులు ఉన్నారు.

రామారావుకు బాల్య స్నేహితుల సన్మానం

కోదాడరూరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన వంగవీటి రామారావును 1972–73లో కలిసి చదువుకున్న పదోతరగతి ఆయన స్నేహితులు ఆదివారం పట్టణంలోని పబ్లిక్లబ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితులు మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతంపై ఒకే పార్టీలో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అనంత రాములు, వేనేపల్లి సత్యనారాయణ, మదన్‌మోహన్‌రావు, ఈశ్వర్‌రావు, మూర్తి, సత్యనారాయణ, శివరామయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హుజూర్‌నగర్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1985–86లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 39ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకుని తమ గత స్మృతులను గుర్తుచేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరినీ వేదిక పైకి ఆహ్వానించి వారి అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు దూళిపాల అనంత రామశర్మ, నిర్వాహకులు పిల్లలమర్రి రాము, శంభుని సాయిబాబా, ధూళిపాళ శివరామకృష్ణ, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు స్థానికంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 30ఏళ్ల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మోతె : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా అయ్యప్ప మహా మండల పడిపూజ



మహా పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

మఠంపల్లి : మండలంలోని లాలితండాలో అయ్యప్పస్వామి మహా మండల పడిపూజను మడత రవి గురుస్వామి, బత్తుల తిరుపతయ్య గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. అదే విధంగా అయ్యప్పస్వామి భజన పాటలతో హోరెత్తించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, అధిక సంఖ్యలో అయ్యప్పస్వాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



గరిడేపల్లి : సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు



మునగాల : నారాయణగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు



మఠంపల్లి : చౌటపల్లిలో సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

గరిడేపల్లి : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 257 ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని, సమగ్ర కుటుంబ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9, 10తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి ఇంటి యజమానులతో సఖ్యతగా ఉండి సమాధానం రాబట్టాలని, ఎన్యుమరేటర్స్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ గోపి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవంతి, ఆర్‌ఐ జి.రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ శ్రీను, బీఎల్‌ఓ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవసరం లేని కాలాలను తొలగించాలి

హుజూర్‌నగర్ : కుటుంబ సమగ్ర సర్వే పత్రంలో అవసరం లేని కాలాలను ప్రభుత్వం తొలగించాలని విన్నపం ఒక పోరాట వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ లీలావతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేపట్టడం హర్షించదగ్గ విషయమని ఆమె పేర్కొన్నారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

మఠంపల్లి : మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని చౌటపల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండలంలో 29గ్రామ పంచాయతీల పరిధిలో 15,401ఇళ్లు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 116మంది ఎన్యుమరేటర్లను నియమించి 13మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఏఈ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి మద్దుల వెంకటేశ్వర్లు, ఎన్యుమరేటర్లు పద్మ, వీరజ్యోతి, నాగమణి, రవి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు మండల ప్రజలు సహకరించాలని తహసీల్దార్ వి.ఆంజనేయులు కోరారు. ఆదివారం మండలంలోని నరసింహాపురం, ముకుందాపురం, బరాఖత్‌గూడెం, కృష్ణానగర్, నారాయణగూడెం గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అదే విధంగా స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ ఎస్.రామారావు, సూపర్‌వైజర్లు వసంత, శైలజ, ఎన్యుమరేటర్లు సత్యనారాయణ, నాగరాజు, శ్వేత, రజిత, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన వెల్ఫేర్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు కార్మికులకు అందకుండా చేస్తోందని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్క సోమయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలు సరికాదని, మొండిగా వ్యవహరించిన ఏ ప్రభుత్వం పాలన కొనసాగించినట్లు చరిత్రలో లేదన్నారు. కార్మిక ఆగ్రహానికి గురికావద్దని పోరాటాలు కొత్త కాదని సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పడానికి కార్మికులు సిద్ధంగా ఉంటారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వమే నేరుగా సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు, చామకూరి గోపిచంద్, పోతబత్తిని బాజీ, గుండు స్వామి, ఉదయ్, చిట్టిబాబు, లక్ష్మయ్య, వీరస్వామి, వెంకన్న, నారాయణ, సాంబయ్య, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేముల గోపాల్ మృతి ఏఐటీయూసీకి తీరనిలోటు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన హమాలీ సంఘం నాయకుడు వేముల గోపాల్ మృతి ఏఐటీయూసీకి తీరనిలోటని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాసు అన్నారు. ఆదివారం పట్టణంలో గోపాల్ మృతదేహంపై సంఘం జెండా కప్పి, పూలమాల వేసి జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ ప్రాంతీయ నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, చింతకుంట్ల విజయ, కాంగ్రెస్ నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, వేముల వెంకన్న, రాజు, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్తీకపౌర్ణమికి రెడ్డిసత్రంలో అన్నదానం



సమావేశంలో పాల్గొన్న సత్రం కమిటీ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఈనెల 15న జరగనున్న కార్తీక పౌర్ణమికి తరలివచ్చే రెండు తెలుగు రాష్ట్రాల భక్తులకు స్థానిక రెడ్డి నిత్యాన్నదాన సత్రంలో భారీగా అన్నదానం చేయనున్నట్లు సత్రం కమిటీ అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సత్రకమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్నదాన సత్రంలో నిర్మిస్తున్న అదనపు గదులు, భోజనశాలకు నిధులు సమకూర్చేందుకు తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రకమిటీ కార్యదర్శి నాగిరెడ్డి, కోశాధికారి వెంకటరెడ్డి, కోదాడ పీఏసీఎస్ చైర్మన్ వి.శ్రీనివాసరెడ్డి, గుంటూరు జిల్లా దాచేపల్లి మాజీ వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మట్టారెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మి, మల్లేశ్వరి, పాపిరెడ్డి, చౌదరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన స్టూడెంట్స్ కోఫోకాన్ కరాటే విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో జరిగిన 9వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. నాగారుద్ర, మీరా, ఆరాధ్య గోల్డ్ మెడల్స్, తుహియ, తీర్థా, ఎగాన్‌లు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ ఆరే మాధవిలత ఆదివారం వెల్లడించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చీఫ్ ఆర్గనైజర్, జాక్ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ చేతుల మీదగా మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ మాధవిలత మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు. ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని, తల్లిదండ్రులు క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



కోదాడరూరల్ : హోమ పూజలో పాల్గొన్న భక్తులు

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంటలో గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పత్తిపాక కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల బృందంచే స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రామయణ మన్యసూక్త మక్షమాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి అరటి పండ్లతో అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలోని ఆదివారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 210మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. ఈ అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన అర్వపల్లి రమేష్ – పద్మావతి, యార్లగడ్డ భిక్షం –అలివేణి, తంగెళ్ల వెంకన్న –మంగమ్మ దంపతులు, నడిగూడెం మండలం కరివిరాలకు చెందిన అయ్యగారు సహకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు సురేష్, కొమ్ము ఈదారావు, తంగెళ్ల సాంబశివరావు, పలువురు అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



మునగాల : అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కీతవారిగూడెం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలి

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ ఆదివారం ప్రజలతో కలిసి ప్రజా కళాకారుడు బాదే నర్సయ్య ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీతవారిగూడెం గ్రామాన్ని మండలం చేయాలని 16గ్రామపంచాయతీలకు అందుబాటులో ఉన్న గ్రామాన్ని ప్రజల సౌకర్యార్థంగా ఉందని, మండలం చేస్తామని హామీ ఇచ్చారు తప్పా ఇంత వరకు అమలు చేయాలన్నారు. మండలంగా చేసేంత వరకు గ్రామాల్లో తిరిగి ధూంధాం ఆటపాట నిర్వహిస్తానని, మండలాన్ని సాధించే వరకు ఉద్యమాన్ని చేపడతానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళలు జ్యోతి, రమ, మంగమ్మ, లక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.